# పట్టాలు తప్పినపుడు

రోజూ చేరుతున్న గమ్యానికే
రొప్పుతూ పరిగెడుతున్న
లోకల్‌రైలు లాంటి జీవితం
పట్టాలు తప్పినపుడు
గేటు రహదారి
ట్రాఫిక్‌జామ్‌కు గురవుతుంది
హఠాత్తుగా
పక్షవాతం వాత పడ్డట్టవుతుంది
అంతా అస్తవ్యస్త మవుతుంది
ఉన్నప్పుడు ఊసెత్తని వాటి విలువ
ఊహాతీత మవుతోంది
ఆధారపడ్డప్పటి నుండి
అవసరాలుగా మార్చుకున్నప్పటి నుండి
అవిటి బతుకు
అలవాటవుతోంది
జీవితం నియంత్రించబడ్డ యంత్రమవుతోంది
కాలం ఖరీదు పెరుగుతున్నప్పటి నుండి
నమ్మకాల సంతకాలు
చెరిగిపోతున్నప్పటి నుండి
ఇంటి ముందు పక్షులు సైతం
ఎందుకైనా మంచిదని
ఇంకో చోట కూడా
గూళ్లు కట్టుకుంటున్నాయి
దూసుకు పోతున్న రైల్లో కూడా
దూకేయ గల్గుతున్న సంతృప్తి మిగలటానికి
మార్గాంతరాలు మనిషికి కూడా లేక పోలేదు

ఈలోగా . . .

ప్రత్యామ్నాయం లేని జీవితం

ముక్కలు చెక్కలు కాకుండా ఉంటే . . .